క్లుప్తంగా

చలో ఢిల్లీకి తరలిరండి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న భవన నిర్మాణ కార్మికులు

సబ్బవరం: కార్మిక, కర్షకుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల5న నిర్వహించ తలపెట్టిన చలోఢిల్లీ కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు తరలిరావాలని ఆ సంఘం నాయకుడు గొంతిన అప్పారావు పిలుపునిచ్చారు. సబ్బవరంలోని భవన నిర్మాణ కార్మికుల సంఘ కార్యాలయంలో శనివారం చలో ఢిల్లీ కార్యక్రమం గోడపత్రికను ఆవిష్కరించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతువ్యతిరేకంగా, ప్రైవేటు, పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూడి అప్పలనాయుడు, గొంప మత్యాలనాయుడు, ఏలూరి శ్రీను,గోపి సత్యం,నక్కా సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం పీహెచ్‌సీ పరిశీలన



ఎరుకునాయుడుపాలెంలో డ్రైన్లను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్

సబ్బవరం: సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అనకాపల్లి డీఎంహెచ్‌వో డాక్టర్ హేమంత్ శనివారం సందర్శించారు. వైద్య సిబ్బంది పనితీరును పరిశీలించి అనంతరం రికార్డులు తనిఖీచేశారు. అలాగే అసకపల్లి,ఎరుకునాయుడుపాలెం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇమ్యునైజేషన్,డ్రైడే సందర్భంగా సిబ్బంది చేపట్టిన కార్యక్రమాలను పరిశీలించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఆయన వెంట సబ్బవరం పీహెచ్‌సీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ చక్రవర్తి, వైద్య సిబ్బంది ఉన్నారు.

విద్యార్థిని అదృశ్యం

సింహాచలం: ఇంటర్ విద్యార్థిని అదృశ్యం పై పెందుర్తి పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. విరాట్‌నగర్‌కు చెందిన రాయి భూమిక ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షలు రాసింది. గత నెల 29వ తేదీన మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఇప్పటి వరకుతిరిగిరాలేదు. ఈ విషయంపై భూమిక తల్లి ధనలక్ష్మి ఫిర్యాదు మేరకు పెందుర్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన 9440796039, 9908166714, 8008842857 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మహిళా పోలీస్ రమాదేవికి అవార్డు



రమాదేవికి సర్టిఫికెట్ అందజేస్తున్న సీపీ శ్రీకాంత్

సింహాచలం: పెందుర్తి మండలం చింతగట్ల పంచాయతీ గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఒల్లి రమాదేవి పనితీరుకు గుర్తింపు లభించింది. ఈమె సీపీ సీహెచ్ శ్రీకాంత్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నారు. లోన్ యాప్స్‌తో పాటు వుమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, సైబర్ నేరాలు, దిశ యాప్‌పై మహిళలకు అవగాహన కల్పించడంతో ఈ అవార్డు లభించింది.

గంజాయి పట్టివేత

అదుపులో ఇద్దరు మైనర్లు

మల్కాపురం: సాధారణ తనిఖీలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు ఇద్దరు మైనర్లు ద్విచక్ర వాహనంపై వస్తున్న తీరు అనుమానం కలిగించింది. దీంతో ఆ వాహనాన్ని తనిఖీ చేయగా వారి వద్ద ప్యాక్ చేసి ఉన్న రెండు కేజీల గంజాయి గుర్తించారు. స్థానికులైన ఇద్దరు మైనర్లు ద్విచక్ర వాహనం పై గాజువాక మార్గం నుంచి శ్రీహరిపురం వైపు వస్తున్నారు. అయితే మల్కాపురం లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీసులు శ్రీహరిపురం వద్ద శనివారం మధ్యాహ్నం గస్తీ చేపట్టారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై వేగంగా వస్తున్న మైనర్లను ట్రాఫిక్ పోలీసులు నిలిపారు. వారు పొంతన లేని సమాధానాలు చెప్పడం.. వారి వెంట తెచ్చిన ప్యాకెట్ ఏంటి అని అడిగితే దాన్ని దాచే యత్నం చేశారు. దీంతో పోలీసులు ఆ ప్యాకెట్ తెరిచి చూడగా రెండు కేజీల బరువు గల గంజాయి ఉంది. దీంతో వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

ఉప్పు సాగు భారం!



ఉప్పు మడుల్లో పూడికలు తొలగిస్తున్న కూలీలు



ఉప్పు తీయడానికి సిద్ధం చేసిన మడులు

- అకాల వర్షాలతో పెరిగిన ఖర్చులు
- పెరిగిన ఉప్పు ధర

పరవాడ: ఇటీవల కురిసిన అకాల వర్షాలు ఉప్పు రైతులపై భారం మోపాయి. పంటచేతికందే సమయంలో వర్షాలు కురవడంతో మడుల్లో నీరు చేరింది. అక్కడక్కడా సేకరించి నిల్వ చేసిన ఉప్పు కూడా వర్షార్పణం అయింది. దీంతో పంటను తిరిగి పునరుద్ధరించుకునేందుకు రైతులు సమాయత్తమయ్యారు.

ఇదీ పరిస్థితి

వాడచీపురుపల్లి శివారు దళాయిపాలెంలో ఉప్పు పంట సాగుచేస్తున్నారు. అకాల వర్షాల కారణంగా తీవ్ర నష్టం సంభవించింది. సుమారు 200 ఎకరాల్లో ఉప్పు పంటకు నష్టం పోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే డిసెంబరు నుంచి మే వరకు ఉప్పు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. రైతులు నాలుగు రాళ్లు వెన కేసుకొనే అవకాశాలు ఉంటుంది. ఈ ఏడాది జనవరి నుంచి కాస్త ఎండలు మెండుగా కాయడంతో ఉప్పు పంట దిగుబడులు బాగున్నాయని రైతులు సంబర పడుతున్న తరుణంలో మార్చిలో కురిసిన అకాల వర్షాలకు గట్ల మీద నిల్వ చేసిన ఉప్పు కొట్టుకుపోయింది. ప్లాట్ ఫారాలపై నిల్వ చేసిన ఉప్పు నిల్వలు కరిగిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు తిరిగి ఉప్పు మడులు సిద్ధం చేయడంలో నిమగ్నమయ్యారు. వర్షాల కారణంగా మడుల్లో చేరిన వర్షపు నీటిని బయటకు పంపి పూడికలు తొలగించి కాలువ గట్లను పటిష్టపరుస్తున్నారు. దీంతో సాగుపై భారం పడిందని వాపోతున్నారు. కొందరు రైతులు ధైర్యంతో అధిక పెట్టుబడి అయినా కొంత మేర ఉప్పు పంటను రాబట్టడానికి ప్రయత్నిస్తున్నారు.

ధర పెరిగినా నిరాశే..

అకాల వర్షాలు కారణంగా ఉప్పు పంట దెబ్బతినడంతో చాలా చోట్ల ఉప్పు నిల్వలు సన్నగిల్లాయి. ఫలితంగా ఉప్పు ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. గత ఫిబ్రవరి వరకు 80 కిలోల ఉప్పు బస్తా ధర రూ.220 ఉంటే వర్షాలు అనంతరం అదే ఉప్పు బస్తా ధర రూ.300కు పెరిగింది. పెరిగిన ధరలు కొంత మంది రైతులకు ఊరట కలిగించినా.. మరికొంతమంది రైతులకు కన్నీళ్లు పెట్టించాయి. ఉప్పుకు పెరిగిన డిమాండ్‌తో గంపెడు ఆశతో ఉప్పు పంటకు సిద్ధం చేసే పనిలో రైతులు నిమగ్నమయ్యారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ ధ్యేయం



డ్వాక్రా సంఘాలకు చెక్కు అందజేస్తున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

సింహాచలం: మహిళలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగాను ముందుకు నడిపిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాజీ మంత్రి, భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 98వవార్డు పరిధి అడవివరంలో వైఎస్సార్ ఆసరా మూడో విడత సంబరాలు శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పుష్కరిణి సత్రంలో జరిగిన కార్యక్రమంలో 2610 మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.1.67 కోట్ల చెక్కును ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ముత్తంశెట్టి మాట్లాడుతూ ఐదేళ్ల చంద్రబాబు పాలనలో డ్వాక్రా రుణమాఫీ చేయలేదన్నారు. కానీ 2019లో అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాట తప్పకుండా రుణమాఫీ చేస్తున్నారన్నారు. కులమతాలకు అతీతంగా.. పార్టీలు చూడకుండా అర్హత ఉన్న ప్రతీ అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా కింద ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 19వేల 700 కోట్లు నేరుగా ఖాతాల్లో జమ చేశారన్నారు. మహిళల రక్షణ కోసం దిశయాప్ తీసుకొచ్చారని చెప్పారు. జీవీఎంసీలో 98వ వార్డులుంటే సగం మహిళలకే టికెట్లు ఇవ్వడంతో పాటు మేయర్ కూడా మహిళకే ఇచ్చారన్నారు. ఒకప్పుడు సంక్షేమ పథకాల కోసం కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండేదని.. నేడు సచివాలయాలు, వలంటీర్ల ద్వారా 23 సంక్షేమ పథకాలు నేరుగా ఇంటి వద్దకే వస్తున్నాయన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

త్వరలో భూ సమస్య పరిష్కారం

సింహాచలం దేవస్థానం భూసమస్య త్వరలోనే పరిష్కారం అవుతుందన్నారు. ఇటీవల అమరావతిలో జరిగిన సమావేశంలో సమస్యపై చర్చించడం జరిగిందన్నారు. ప్రభుత్వం దేవస్థానానికి ల్యాండ్ టు ల్యాండ్ ఇవ్వడానికి సిద్ధంగా ఉందని చెప్పారు. కోర్టు కేసు త్వరలోనే పరిష్కారం కావాలని ఆశిస్తున్నానన్నారు. ఇళ్ల మరమ్మత్తులు చేసుకునేందుకు అవకాశం కల్పించాలని సమావేశంలో కోరామని.. కొద్ది రోజుల్లో దానికి సంబంధించి ఉత్తర్వులు కూడా వస్తాయని తెలిపారు. సమావేశంలో జోన్–8 జెడ్సీ మల్లయ్యనాయుడు, ఏపీడీ వై.వె.శ్రీరామ్, సీవో నరసింహం, భీమిలి వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి మహేష్, 98వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి ఎర్ర వరహా నరసింహం, నాయకులు లంక సత్తిబాబు, ఎస్.రామరాజు, టి.రాము తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల పరిశీలన



పెందుర్తి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంఈవో

సింహాచలం: పదో తరగతి పరీక్షల నిర్వహణకు పెందుర్తి మండలంలో 12 కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు ఎంపీడీవో వెంకటరావు, ఎంఈవో పైడపు నాయుడు తెలిపారు. పెందుర్తి ప్రభుత్వ పాఠశాలతో పాటు పలు కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని నరవ జెడ్పీ హైస్కూల్, కోటనరవలోని జమియా ఇస్లామ్ అషరపుల్ ఉలూమ్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, పురుషోత్తపురంలోని మహతి హైస్కూల్, సరిపల్లి జెడ్పీ హైస్కూల్, పెందుర్తి ప్రభుత్వ హైస్కూల్(వొకేషనల్), పెందుర్తి శ్రీ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్, పెందుర్తిలోని నవ్యవికాస్ హైస్కూల్, పెందుర్తి జిల్లా పరిషత్ హైస్కూల్, వేపగుంట జిల్లాపరిషత్ హైస్కూల్, పెందుర్తి నారాయణ ఇంగ్లిషు మీడియం హైస్కూల్, గుర్రంపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్, చింతలగ్రహారం జిల్లా పరిషత్ హైస్కూల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 11 ప్రభుత్వ పాఠశాలలు, 29 ప్రైవేటు స్కూళ్లు నుంచి మొత్తం 3064మంది విద్యార్థులు ఈ ఏడాది పదోతరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నట్టు ఎంఈవో తెలిపారు.

పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యం

సీతంపేట : రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల సంఘం ఆరోపించింది. ఆంధ్రప్రదేశ్ సర్పంచుల సంఘం సమావేశం స్థానిక పౌరగ్రంథాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వై.బి.రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సర్పంచులు ఎవరూ విద్యుత్ బిల్లులు కట్టవద్దన్నారు. సర్పంచుల సంతకం లేకుండా 14, 15 ఆర్థిక సంఘం నిధులు రూ.8,660 కోట్లు నిధులు దారి మళ్లించిందని విమర్శించారు. సర్పంచుల విధులు, నిధులు, అధికారాలపై విస్తృతంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్ర సర్పంచుల సంఘం అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మి మాట్లాడుతూ సర్పంచుల గౌరవ వేతనం రూ.15వేలకు, జెడ్పీటీసీ, ఎంపీటీసీల గౌరవ వేతనం రూ.30 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సర్పంచుల సంఘం ప్రెసిడెంట్ వై.నాగేంద్ర మాట్లాడుతూ రాజేంద్ర ప్రసాద్ ఆధ్వర్యంలో రాష్ట్రమంతటా పర్యటించి సర్పంచుల విధులు, అధికారాలపై చైతన్య పరిచేలా పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉత్తరాంధ్ర జిల్లాల సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్

3 నుంచి ఒంటిపూట బడులు

సబ్బవరం: ఈ నెల 3వ తేదీ నుంచి మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎస్. అప్పలరాజు శనివారం తెలిపారు. ఉదయం 7.45 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ తరగతులు నిర్వహించాలని పేర్కొన్నారు. పదోతరగతి పరీక్షలు నిర్వహిస్తున్న కేంద్రాలు ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల పరీక్షల జరిగే ఆరు రోజుల పాటు తరగతులు ఉండవన్నారు. ఈ పాఠశాలలలో ఈ నెల 30వ తేదీ మధ్య అందుబాటులో ఉన్న ప్రభుత్వ సెలవు దినాల్లో ఆరు రోజుల పాటు తరగతులు నిర్వహించాలని తెలిపారు.

'చలో ఢిల్లీ' కి కార్మిక నాయకులు



విశాఖ రైల్వేస్టేషన్‌లో ఢిల్లీకి బయలుదేరిన కార్మిక నాయకులు

తాటిచెట్లపాలెం: ఢిల్లీలో ఈ నెల 5న జరగనున్న కార్మిక, కర్షక సంఘర్ష్ ర్యాలీకి విశాఖ నుంచి కార్మిక నాయకులు శనివారం ఉదయం సమతా ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి వెళ్లారు. సుమారు వంద మంది భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు తరలి వెళ్లారు. వీరికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.జగన్ అభినందనలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలు, కార్మిక చట్టాల తొలగింపు, కనీస వేతనం, కొత్త పెన్షన్ విధానం రద్దు కనీస మద్దతు ధర వంటి పలు అంశాలపై ఢిల్లీలో ర్యాలీ జరగనుందని చెప్పారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శులు తులసి, అప్పలరాజు, అనసూయ, నాయకులు బి.వెంకటరావు, శంకరరావు, దేవి, బృంద, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సినీ సంగీత విభావరి



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

సీతంపేట: హైదరాబాద్‌కు చెందిన శ్రీకృష్ణ స్వర రాగ ప్రవంతి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో స్వరరాగ గంగా ప్రవాహమే శీర్షికన సినీ సంగీత విభావరి నిర్వహించారు. వండర్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు గ్రహీత వై.ఎస్.రామకృష్ణ పాడిన స్వర రాగ గంగా ప్రవాహమే, శైలజతో కనుపాప కరువైన, సాయి మేఘనతో మురిపించే అందాలే, శివరామకృష్ణ, సాయిమేఘన పాడిన ఓహో మోహన రూపా పాటలు అలరించాయి. నూకల రామ నరసింహం, మేఘన, తుషార నిలయ పాడిన జగదానంద కారక, గంటి రామకృష్ణ, ఉమా గోపాల్ పాడిన హలో హలో ఓ అమ్మాయి, మహమ్మద్ ఖాన్, వీణ పాడిన అమ్మో నీ రేగు పల్లు, సుబ్రహ్మణ్యం పాడిన తిరుమల మందిర సుందర వంటి చక్కని గీతాలు ప్రేక్షకులకు వీనుల విందు చేశాయి. ఎస్.లలిత వ్యాఖ్యాతగా వ్యవహరించారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి, సినీ నటుడు ప్రసన్నకుమార్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం గాయకులను ఘనంగా సత్కరించారు.

కల్యాణ ఏర్పాట్ల పరిశీలన



యాగశాలలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న ముత్తంశెట్టి

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసంహస్వామిని శనివారం భీమిలి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దర్శించుకున్నారు. ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన స్వామివారి వార్షిక కల్యాణ ఏర్పాట్లను పరిశీలించారు. ట్రస్ట్ బోర్డు సభ్యుడు దినేష్‌రాజ్ ఆయన వెంట ఉన్నారు.

ప్రజా సమస్యలపై స్పందించండి



96వ వార్డులో పర్యటిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని సచివాలయాల ఉద్యోగులకు పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ సూచించారు. 96వ వార్డు పరిధిలోని సచివాలయాల ఉద్యోగులతో శనివారం పెందుర్తిలోని తాండ్ర పాపారాయుడు కల్యాణ మండపంలో ఎమ్మెల్యే సమీక్ష నిర్వహించారు. వార్డు పరిధిలోని పలు సమస్యలపై ఆయన ఉద్యోగులతో చర్చించారు. ముఖ్యంగా డ్రైనేజీ సమస్యలపై దృష్టి సారించాలని సూచించారు. సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన పలు డ్రైనేజీలను పరిశీలించారు. జోన్–8 జెడ్సీ మల్లయ్యనాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు గొర్లె రామునాయుడు, సరగడం నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- ఎంఈవో సునీత



ఎం.సునీత, ఎంఈవో, పరవాడ

పరవాడ: మండలంలోని వివిధ పాఠశాలల్లో ఈ నెల 3 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని మండల విద్యాశాఖాధికారి ఎం.సునీత చెప్పారు. పరవాడలో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. మండలంలో పెదముషిడివాడ, వాడచీపురుపల్లి, పరవాడ సుమేధ, లంకెలపాలెం, తానాం, పరవాడ బాలికలు, పరవాడ బాలుర జెడ్పీ పాఠశాలల్లో ఏడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ పరీక్షా కేంద్రాల్లో 655 మంది బాలికలు, 623 మంది బాలురు పదో తరగతి పరీక్షలు రాస్తారని చెప్పారు. పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం12.45 వరకు జరుగుతాయన్నారు. కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన తాగునీరు, విద్యుత్, బెంచీలు, ఫ్యాన్లు, లైట్లు, వైద్యం వంటి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి అరగంట ముందుగా చేరుకోవాలన్నారు. కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఉంటుందని ఎంఈవో సునీత చెప్పారు.

ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత

- ప్రజల భాగస్వామ్యంతోనే స్వచ్ఛత
- డీపీఆర్సీ కోఆర్డినేటర్ నాగలక్ష్మి



మాట్లాడుతున్న జిల్లా కో ఆర్డినేటర్ నాగలక్ష్మి

సబ్బవరం: పారిశుధ్య నిర్వహణకు ప్రజలు సహకరించినప్పుడే స్వచ్ఛత సాధ్యమవుతుందని జిల్లా పంచాయతీ రిసోర్సెస్ కో ఆర్డినేటర్(డీపీఆర్సీ) నాగలక్ష్మి అన్నారు. సబ్బవరం మండల పరిషత్ కార్యాలయంలో ఆమె శనివారం విలేకరులతో మాట్లాడారు. చెత్తసేకరణకు కనీస చార్జీలు చెల్లించకుండా మొండి వాదనతో ప్రజలు ముందుకు వెళ్లడం సరికాదన్నారు. ప్రజల భాగసామ్యం ఉన్న చోట బాధ్యతాయుతంగా పారిశుధ్య నిర్వహణతో గ్రామీణ,పట్టణ ప్రాంతాలన్నీ పరిశుభ్రంగా ఉంటాయన్నారు. జిల్లాల పునర్విభజన తర్వాత అనకాపల్లి జిల్లా సర్వతో ముఖాభివృద్ధి సాధించేందుకు కృషి చేస్తున్నారన్నారు. స్వచ్ఛ సంకల్పంలో భాగంగా స్వచ్ఛ అనకాపల్లి జిల్లాగా తీర్చిదిద్దేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా జిల్లాలోని 646 పంచాయతీల్లో 500 వరకూ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు పూర్తయ్యాయన్నారు. జిల్లా విభనకు ముందు 300 వరకూ కేంద్రాలు ఉండగా ప్రస్తుతం జిల్లా కలెక్టర్ చొరవతో 433 వరకూ కేంద్రాలు వినియోగంలో ఉన్నాయన్నారు. అయితే కేంద్రాల నిర్వహణలో భాగంగా ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించడం,వాటిని విడదీయం,కేంద్రాలకు తరలించడం సవాలుగా మారుతుందన్నారు. ప్రజల భాగస్వామ్యంతో ఈ సవాళ్లను అధిగమించి ముందుకు సాగడం ద్వారా సత్ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటి వరకూ సేకరించిన సుమారు 300 వరకూ లారీల చెత్తను జిందాల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రానికి తరలించామన్నారు. వీటితో పాటు గ్రామాలను ఆనుకుని,నడిబొడ్డున ఉన్న చెరువులు, కొలనులను జిల్లా కలెక్టర్ ఆదేశాలతో అభివృద్ధి చేసి సుందరీకరించేదుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు.దీనిలో భాగంగా సబ్బవరంలోని దండి కోనేరు, ఆరిపాకలోని కోనేరును ఎంపిక చేసినట్టు చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో రమేష్ నాయుడు,ఈవోఆర్డీ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో తనిఖీ అధికారుల ప్రత్యేక దృష్టి



మాట్లాడుతున్న డీఈవో చంద్రకళ

విశాఖ విద్య: పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి అవాంతరాలు లేకుండా చూడాల్సిన బాధ్యత ఫ్లైయింగ్, సిటింగ్ స్క్వాడ్‌లపై ఉందని డీఈవో ఎల్.చంద్రకళ అన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ టీమ్‌లో నియమితులైన అధికారులతో శనివారం క్వీన్ మేరీ హైస్కూల్లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో పదో తరగతి పరీక్షల్లో ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా తనిఖీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో ఎంపిక చేసిన పరీక్ష కేంద్రాల్లో డీఈవో కార్యాలయం నుంచి డ్యూటీ వేసిన వారు మాత్రమే విధులు నిర్వహించాలన్నారు. ప్రైవేటు స్కూళ్ల మేనేజిమెంట్ వారు, కరస్పాండెంట్, హెచ్‌ఎం ఎవరూ ఉండటానికి వీల్లేదన్నారు. పరీక్షల నిర్వహణలో ఎదురయ్యే అవాంతరాలను సకాలంలో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు ప్రాజెక్టు కో–ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మురళీమోహన్, ప్రభుత్వ డైట్ కాలేజీ ప్రిన్సిపాల్ మాణిక్యం నాయుడు, డీసీఈబీ సెక్రటరీ కృష్ణకుమార్, ఏపీవో అప్పలనాయుడు, భీమరాజు పాల్గొన్నారు.

షిప్‌యార్డ్‌లో సొసైటీ కార్మికుడి మృతి



మృతుడు రవి (ఫైల్)

మల్కాపురం: అంత వరకు విధులు నిర్వహిస్తున్న కార్మికుడు ఒక్కసారి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో చికిత్స కోసం తరలించగా కొంత సమయానికే మృతి చెందాడు. దీంతో తోటి కార్మికులు, మృతుడి బంధువులు న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. వివరాలు.. హిందుస్థాన్ షిప్‌యార్డ్‌లోని మాజీ సొసైటీలో రవి (42) కొన్నేళ్లుగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శనివారం రవి తను పని చేస్తున్న బాండ్ స్టోర్‌లో పని చేసుకుంటున్నాడు. అయితే మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఛాతిలో నొప్పిగా ఉందని తోటి కార్మికుడి సాయంతో సంస్థ ఆవరణలోని ఆస్పత్రికి వెళ్లాడు. అక్కడ వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం ఈఎస్ఐ ఆస్పత్రికి తీసుకువెళ్లాలని సూచించారు. నొప్పితోనే ఆస్పత్రి నుంచి తన డిపార్ట్‌మెంట్ వరకు రవి నడిచి వెళ్లడంతో నొప్పి మరింత ఎక్కువ అయ్యి నోటి నుంచి నురగలు వచ్చి డిపార్ట్‌మెంట్ వద్ద కుప్పకూలిపోయాడని సొసైటీ యూనియన్ ప్రతినిధులు చెప్పారు. ఇలా కుప్పకూలిపోయిన రవి కొద్ది క్షణాల్లో మృతి చెందాడు. దీంతో యూనియన్ ప్రతినిధులు శివారెడ్డి తదితరులు ఆందోళన చేశారు. మృతుడు కుటుంబానికి న్యాయం చేయాలని, రూ. 15 లక్షల సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని అధికారులు యూనియన్ ప్రతినిధులకు హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

సంతోషం నిలవలేదు

రవికి వివాహం అయిన చాలా ఏళ్ల తర్వాత కొద్ది నెలల కిందట బాబు పుట్టాడు. దీంతో ఎంతో ఆనందంగా ఉండేవాడు అయితే ఆ సంతోషం ఎంతో కాలం నిలవలేదు.